ప్రజాశక్తి
ఆదివారం 30 జూన్, 2024
5
శ్రీకాకుళం

'ఉపాధి' పనులు ఆపొద్దు

శ్రీకాకుళం అర్బన్ : ఉపాధి హామీ పనులను వ్యవసాయ పనులు ఆరంభమయ్యాయన్న కారణంతో నిలుపుదల చేస్తున్నారని, దీనివల్ల వ్యవసాయ కూలీలకు తీరని నష్టం జరుగుతోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పనులు సీజన్ ప్రారంభమైందని, భూస్వాముల ఒత్తిడితో స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి పని నిలుపుదల చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే పీడీ జోక్యం చేసుకొని జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పించాలన్నారు. వర్షాలు ముమ్మరంగా పడి పనులు ప్రారంభ ఉపాధి పనులు చేయడానికి అవకాశం లేనప్పుడు పనులు నిలుపుదల చేయాలన్నారు. కానీ, ముందుగా ఉపాధి పనులు ఆపడం వల్ల కూలీలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.

రేపట్నుంచి పింఛన్ల పంపిణీ

- ఎన్‌టిఆర్ భరోసాగా పేరు మార్పు
- జిల్లాలో 3,19,702 మంది చేకూరనున్న లబ్ధి
- సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దకే...

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందిస్తున్న సామాజిక భద్రత పింఛను పెంచుతూ కొత్త ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఇతర దీర్ఘకాల రోగ గ్రస్థులకు ఆర్థికభరోసా కల్పిస్తూ... ప్రతినెలా అందిస్తున్న పింఛనుకు ఎన్‌టిఆర్ భరోసాగా నామకరణం చేశారు. సోమవారం నుంచి పెంచి పింఛనుతో పాటు మూడు నెలల ఏరియర్స్‌ను జమ చేసి పంపిణీ చేయనున్నారు. వాలంటీరు వ్యవస్థను కాదని క్షేత్రస్థాయిలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే ఇంటింటికీ వెళ్లి అందించనున్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు ముందుగా ప్రకటించిన అదనపు మొత్తం రూ.వెయ్యి వంతున రూ.3 వేలు, జూలై నెల రూ.4 వేలు కలిపి మొత్తంగా రూ.7000 జూలై 1న పంపిణీ చేయనున్నారు.

జిల్లాలో 15 కేటగిరిలకు చెందిన పింఛను దారులున్నారు. వారిలో వృద్ధులు, వితంతువులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, ఒంటరి మహిళలకు సామాజిక భద్రత పింఛన్ల పరిధిలోకి వస్తారు. వారితో పాటు మత్స్యకారులు, ఎఆర్‌టి (హెచ్‌ఐవి రోగగ్రస్తులు), సంప్రదాయ చెప్పులు కుట్టేవారు, లింగమార్పిడి (హిజ్రా), డప్పు కళాకారులకు, కళాకారులకు పింఛను నెలకు రూ.4 వేలు చెల్లించనున్నారు. వికలాంగులకు, బహుళ వైకల్య, కుష్టు వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.6 వేలు, వంద శాతం వైకల్యం ఉన్న వారికి నెలకు రూ.10 వేలు, దీర్ఘకాలిక వ్యాధులైన ద్వైపాక్షిక ఎలిఫెంటియాసిస్- గ్రేడ్ 4, కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి, ప్రభుత్వ, నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేయించు కుంటున్న వారికి నెలకు రూ.10 వేలు పెంచారు. అయితే పాత పింఛను పాస్ పుస్తకాన్ని వినియోగించకుండా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తూ లబ్ధిదారుల నుంచి రసీదు పొందాల్సి ఉంటుంది.

ఎన్‌టిఆర్ భరోసా పింఛను కింద జిల్లాలోని అన్ని విభాగాలకు నుంచి 3,19,702 మంది లబ్ధిదారులు ఉన్నారు. వారికోసం ప్రభుత్వం రూ.212.07 కోట్ల నిధులు మంజూరు చేసింది. సచివాలయ సిబ్బంది ఈ నిధులు బ్యాంకుల నుంచి డ్రా చేసి జులై 1న ఇంటి వద్దే సచివాలయ ఉద్యోగులు వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 1,71,602 మంది వృద్ధులు, 74,652 మంది వితంతువులు, 10,085 మంది ఒంటరి మహిళలు పింఛన్లు పొందనున్నారు. పింఛనుతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు పేరుతో విడుదల చేసిన పింఛనుదారులకు బహిరంగ లేఖ లబ్ధిదారులకు అందించనున్నారు. వాటిని పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు.

సరైన భద్రత లేకే ప్రమాదాలు

సిఐటియు

ప్రజాశక్తి- రణస్థలం

సరైన భద్రతా చర్యలు పాటించకపోవడం వల్లే మండలంలోని సరకా పరిశ్రమలో శనివారం రసాయనాల ట్యాంకులు పెద్దఎత్తున పేలి అగ్ని ప్రమాదం సంభవించిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యాజమాన్యాలు సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే సరకాలోనూ, పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలోని ఫార్మా పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయని అన్నారు. పలు ప్రమాదాల్లో కార్మికులు చనిపోతున్నా... సంబంధిత యాజమాన్యాలు, ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పరిశ్రమల్లో అధికారులు తూతూమంత్రంగా తనిఖీ చేస్తున్నారని అన్నారు.

మాట్లాడుతున్న అమ్మన్నాయుడు, తేజేశ్వరరావు

పరిశ్రమ యాజమాన్యాలకు లాభాలు తప్ప కార్మికుల భద్రత పట్టడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తనిఖీలు నిర్వహించి పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హైడ్రాలిక్ ఫోమ్ ఇంజిన్ లేకపోవడంతో మంటలు సకాలంలో అదుపులోకి రాలేదని అన్నారు. పలుమార్లు సిఐటియు ఆధ్వర్యాన మంత్రులకు, అధికారులకు పైడిభీమవరంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైరింజనగ ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు ఇచ్చామని గుర్తు చేశారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో హైడ్రాలిక్ ఫోమ్ ఫైరింజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన చట్టాలపై అవగాహన

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

భారతీయ నూతన చట్టాలు జులై 1 నుంచి అమల్లోకి రానున్న నేపథ్యంలో కొత్త చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులకు విశాఖపట్నం సిటీ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ ఎం.శైలజతో నూతన చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ) చట్టాలపై పోలీస్ అధికారులకు పూర్తి అవగాహన కల్పించారు. కొత్త, పాత చట్టాల్లో మార్పులు, చేర్పులను క్షుణ్ణంగా వివరించి వారికున్న సందేహాలను నివృత్తి చేశారు.కొత్త చట్టాల అమలు జరిగిన వెంటనే ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన పెంచుకొని బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి, ఏకే సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్టు, వాంగ్మూలం నమోదు, దర్యాప్తులో పాటించాల్సిన జాగ్రత్తలు, ఛార్జిషీట్ ఎలా తయారు చేయాలి, కేసుల ట్రయల్ సమయంలో దర్యాప్తు అధికారులు శిక్షల శాతం పెరిగే విధంగా వ్యవహరించాల్సిన తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని అన్నారు. ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించేందుకు వీలుగా ఉంటుందన్నారు. అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కొత్త చట్టాలను నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆదనపు ఎస్‌పి జి.ప్రేమ్‌కాజల్, డిఎస్‌పి వై.శృతి, శివరామిరెడ్డి, శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ధ్రువపత్రం అందజేస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

లోక్ అదాలత్‌లో 1281 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా 1281 కేసులు రాజీ మార్గంలో పరిష్కారమైనట్టు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లాలోని న్యాయస్థానాల పరిధిలో ఈ కేసులు రాజీచేసినట్టు పేర్కొన్నారు. రాజీ అయిన వాటిలో 143 సివిల్ కేసులు, 1061 క్రిమినల్ కేసులు, పిఎల్‌సి కేసులు 77 రాజీ అయ్యాయన్నారు. ఈ కేసుల ద్వారా రూ. 9,13,68,510 మొత్తాన్ని వసూలు చేసినట్టు తెలిపారు. కేసుల రాజీ వల్ల ఇరు పార్టీలకు న్యాయం జరుగుతుందని, వారి మధ్య ఎటువంటి కలహాలు, మనస్పర్థలు ఉండవని అన్నారు. కేసులను పరిష్కరించడంలో న్యాయమూర్తులు పి.భాస్కరరావు, 3వ అదనపు జిల్లా జడ్జి కె.వి.ఎల్.హిమబిందు, ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి, ఆర్.సన్యాసినాయుడు, సివిల్ జడ్జి, కె.శారదాంబ, సివిల్ జడ్జి, మోహిదిన్ జామరూత్ బేగం కమలుదీన్, జడ్జి, డి.శ్రీభరాణి పాల్గొన్నారు.

స్థానచలనం కోసం ఎదురుచూపులు

- ప్రభుత్వం ఏర్పాటైనా తేలని బదిలీలు
- ఆందోళనల్లో ఉద్యోగులు

ప్రజాశక్తి- టెక్కలి

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల సమయంలో బదిలీ అయిన ఉద్యోగులకు ఇంకా బదిలీలు లేకపోవడంతో ఆందోళనలో చెందుతున్నారు. ఎన్నికల కోడ్ అమలయ్యే నేపథ్యంలో రెవెన్యూ, పోలీస్, ఎంపిడిఒ కార్యాలయాల్లో ఉన్న ఉన్నతస్థాయి అధికారులను జిల్లా నుంచి ఇతర జిల్లాలకు బదిలీలు చేశారు. అయితే ఎన్నికలు ముగిసి, ఫలితాలు వెలువడి, ఎన్నికల కోడ్ రద్దు అయింది... రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడింది. అయినా ఇతర జిల్లాలకు బదిలీ అయిన అధికారులకు మాత్రం ఇంకా స్థానచలనం కలగకలేదు. వారు తమ స్థానాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా... ప్రభుత్వం మాత్రం వీరి బదిలీలపై స్పందించకపోవడం గమనార్హం. గడచిన ఆరు నెలల క్రితం పోలీస్ అధికారుల్లో స్థానచలనం ఏర్పడింది. తర్వాత మూడు నెలల క్రితం మిగిలిన శాఖల అధికారులకు బదిలీ అయ్యారు. వారికి ఇప్పటి వరకు మరలా పాత స్థానాలు కేటాయించేందుకు అవసరమైన జిఒల జారీ కోసం ఎదురు చూస్తున్నారు.

ఈ విద్యా సంవత్సరం ఆరంభమైన నేపథ్యంలో పిల్లల చదువులకు సమయం మించిపోతుండడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఈ నెల, జులై నెలల్లో కొంత మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో వారు సొంత జిల్లాలకు రావల్సి ఉంది. ఉద్యోగపరమైన లావాదేవీలు నిర్వర్తించేందుకు సొంత జిల్లాకు రావాల్సిన అవసరం ఉంది. జూన్ నెల పూర్తయినా బదిలీలపై స్పష్టత రాకపోవడంతో ఉద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు చొరవ చూపి బదిలీలపై స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి పనులు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాజీ మంత్రి సొంత నిధులతో మున్సిపాలిటీలో ట్యాంకర్ల ద్వారా నీరు, బోర్లు అందించారని, కమిషనర్ కూడా అప్పటి సమావేశంలో తెలిపారని, ఇప్పుడు ట్యాంకర్ల కోసం రూ.17 లక్షలు బిల్లులు ఎలా పెడుతున్నారని అన్నారు. చాలా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు పంపిణీ కాక ప్రజలు ఇబ్బందులు పడ్డారని ప్రశ్నించారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ ఈ ఏడాది పూర్తి స్థాయిలో నీటి సరఫరా చేశామని, తమకు నీటి సమస్యపై ఎటువంటి ఫోన్లు రాలేదని, నీటి సరఫరా సంతృప్తికరంగా జరిగిందని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ నీటి సమస్య లేదన్నది వాస్తమని, మాజీ మంత్రి సొంత నిధులతో నీరు పంపిణీ చేశారనే వార్తలు తాను చదివానని, ఆయన ఎన్నికల కోసం అలా చెప్పారా? నిజంగా సొంత నిధులు వెచ్చించారా? అనే దానిపై వివరాలు కావాలని కోరారు. దీనిపై కమిషనర్ టి.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ మార్చి నెల నీటిసరఫరా నిధులు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కాంట్రాక్టర్లకు అందించారని, మిగిలిన మూడు నెలల బిల్లులు మాత్రం పెట్టామని తెలిపారు. కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో అవసరమైన సామగ్రి కొనుగోలు వివరాలు పూర్తి స్థాయిలో అజెండాలో పెట్టాలని కోరారు. అదేవిధంగా ఏమి కొనుగోలు చేశారో కౌన్సిలర్లకు చూపించాలన్నారు. గతంలో ఈ విధానం ఎప్పుడూ అమలు కాలేదని తెలిపారు. దీనిపై కౌన్సిలర్ సింహాచలం మాట్లాడుతూ రెండు పార్టీలకు చెందిన కొంత మంది కమిటీగా వేసి సామగ్రిని ఆ కమిటీకి చూపిస్తే బాగుంటుదన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ సింహాచలం మాటను ఏకీభవించి రెండు పార్టీలకు చెందిన ఆరుగురు సభ్యులను కమిటీని వేసి సామగ్రిని వారికి చూపిస్తే ఇటువంటి అపవాదులు రావన్నారు. కౌన్సిలర్లు తంగుడు ఆశాలత, గురిటి సూర్యనారాయణ మాట్లాడుతూ టెండర్ ప్రక్రియ పూర్తయి రెండేళ్లయినా తమ వార్డులో పవర్ బోరు నిర్మాణం కాలేదని, పార్కు పహరీ నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ రోడ్డు, కాలువ వంటి అభివృద్ధి పనులు కేవలం టెండర్‌కు మాత్రమే పరిమితం అవుతున్నాయని, పనులు జరగడం లేదని ఆరోపించారు. దీనిపై కమిషనర్ సమాధానమిస్తూ... సాధారణ నిధుల్లో 50 శాతం నిధులు మాత్రమే వినియోగించాలని జిఒ ఉందని అన్నారు. రూ.3 కోట్లు నిదులు సిఆర్ తీసుకున్నామని అన్నారు. ఎఫ్ఎస్ఎం విధానం ప్రకారం బిల్లులు చేయడానికి ఆలస్యం కావడం, బిల్లులు పెండింగ్ ఉండడం వల్ల కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదని చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, కౌన్సిలర్లు దుర్గాశంకర్ పండా, గుజ్జు జోగారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష



రికార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఇవిఎం గోదాముల పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇవిఎం యూనిట్లను స్ట్రాంగ్ రూమ్‌ల్లో పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గాలవారీగా భద్రపరిచారు. ఈ మేరకు కలెక్టరేట్‌ని ఇవిఎం గోదాంను కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా తిరిగి యూనిట్లను సురక్షితంగా ఇవిఎం గొడౌన్‌కు తరలించామని అన్నారు. వాటిని పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన గదుల్లో భద్రపరచినట్టు తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా గొడౌన్ పరిశీలించినట్టు తెలిపారు. ఆయనతో పాటు డిఆర్ఒ ఎం.గణపతిరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సి-సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

సేవా పతకాన్ని అందుకుంటున్న దొరబాబు

సిక్కోలు జవాన్‌కు సేవా పతకాలు

ప్రజాశక్తి- సోంపేట

ఇటీవల శ్రీనగర్ బారాముల్లా జిల్లా, ఆదిపురాలో చేపట్టిన 32 రాష్ట్రీయ రైఫిల్ ఆపరేషన్లో పాల్గొని, ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాడి ఇద్దరు పాకిస్తానీ ఉగ్రవాదులను అంతమొందించారు. ఇందులో సోంపేట మండలం మామిడిపల్లి పంచాయతీ చిన్న మామిడిపల్లికి చెందిన ఆర్మీ జవాన్ బొడ్డు దొరబాబుకు అతివిశిష్టమైన సేవా మెడల్, సేవా మెడల్‌ను లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ చేతుల మీదుగా అందుకున్నారు. 32, రాష్ట్రీయ రైఫెల్ ఆపరేషన్‌లో స్థానిక కాశ్మీర్ పోలీసులతో కలిసి పాల్గొన్న దొరబాబు, డ్రోన్ సాయంతో ఉస్మాన, ఉమర్ అనే ఇద్దరు పాకిస్తానీ ఉగ్రవాదుల ఆచూకీ తెలుసుకున్నారు. 54 గంటలు పాటు ప్రాణాలు ఎదురొడ్డి పోరాటం చేసి వాళ్లను హతమార్చడంలో ప్రముఖ పాత్ర వహించాడు. దొరబాబు తండ్రి బొడ్డు పురుషోత్తం, ఒక సాధారణ రైతు. దొరబాబుకు విశిష్ట సేవ పతకాలు రావడంపై గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

గోడ దెబ్బ... చెంప దెబ్బ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

అధికారులు, ఉద్యోగులకు ప్రస్తుతం గోడ దెబ్బ, చెంప దెబ్బ రెండూ తగులుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు రెండూ వారిని దోషులుగా చూపే ప్రయత్నం చేస్తున్నాయి. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు ఎంత దుమారం రేపాయో మనం చూశాం. అధికారుల సంగతి చూస్తామన్నట్లుగా బెదిరింపులకు దిగారు. దీంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం వారిని వెంటాడుతోంది. ఇప్పటికే కొంత మంది అధికారులు బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లుగా తెలుస్తోంది. ఇదిఇలా ఉండగా మాజీ ఉపముఖ్య మంత్రి ధర్మాన కృష్ణదాస్ జిల్లా పార్టీ కార్యాలయం నిర్మాణం విషయంలోనూ అధికారులదే తప్పిదమన్నట్లు నిందించడం చూశాం. పెద్దపాడులో నిర్మిస్తున్న వైసిపి కార్యాలయా నికి అనుమతులు లేవంటూ నోటీసులు ఇవ్వడంపై మీడియా సమావేశంలో తీవ్రంగా మండిపడ్డారు. కార్యాలయం నిర్మాణం 80 శాతం పూర్తయినంతవరకు అధికారులు ఏం చేస్తున్నారని, ఇప్పుడు నోటీసులు అతికించడమేమిటని కృష్ణదాస్ ప్రశ్నించడం అందరినీ విస్తుగొల్పుతోంది. అధికార పార్టీని ఎదిరించే సాహసమే ఉంటే అప్పుడే వారు నోటీసులు ఇచ్చేవారు. అప్పుడు వారి పనివారు చేయకుండా ఒత్తిళ్లకు గురి చేసి ఆ దరిదాపుల్లోకి రానీయకుండా చేసి ఇప్పుడు అధికారులను నిందించడం ఎంత వరకు సమంజసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

పార్టీ కార్యాలయాలపై రచ్చ చేస్తున్న టిడిపి నాడు శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో నిర్మించిన స్థలం కూడా ఎవరూ దాతలు ఇచ్చిందేమీ కాదు. బిసి సంక్షేమశాఖకు చెందిన ఆ స్థలాన్ని లీజు పేరుతో నాడు తీసుకుని అందులో పార్టీ భవనాన్ని నిర్మించిన విషయంపై గతంలోనే అనేక విమర్శలు వచ్చాయి. అయినా వెనక్కి తగ్గకుండా టిడిపి నాడు పార్టీ కార్యాలయాన్ని నిర్మించింది. ప్రస్తుత వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భవన నిర్మాణ సమయంలోనూ మంత్రిగానే ఉన్నారు. ఆయన ఆదేశాలతోనే తతంగమంతా నడిచిందన్న విమర్శలూ లేకపోలేదు. అంతెందుకు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంగా ఉన్న ఇందిరా విజ్ఞాన్ భవన్‌ను చెరువుగర్భాన్ని ఆక్రమించి కట్టారని నాడు మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అనేకసార్లు ప్రస్తావించినా అధికారులు కనీసం స్పందించలేదు. మాజీ రెవెన్యూ మంత్రి ఆదేశాలతోనే అధికారులు డిసిసి భవన నిర్మాణానికి పూనుకున్నారంటూ విమర్శలు వెల్లువెత్తాయి. అధికారంలో ఏ రాజకీయ పార్టీ ఉంటే ఆ పార్టీ ప్రభుత్వ స్థలాల్లో పార్టీ భవంతులను నిర్మించడమనేది ఒక సంప్రదాయంగా మార్చేశారు. రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగా నేడు టిడిపి దానిపై దృష్టి సారించడంతో అన్ని పార్టీల గుట్టు తేలుతోంది. పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలను కేటాయింపు జరిపే విషయంలో టిడిపియే తొలుత నాంది పలికిందని వైసిపి ఆరోపిస్తోంది. 2014లో అసెంబ్లీలో పార్టీలకు ఉన్న బలాల ఆధారంగా అమరావతితో పాటు జిల్లా కేంద్రాల్లో పార్టీ కార్యాలయాలకు స్థలాలను కేటాయిస్తూ ఒక జిఒను సైతం తీసుకొచ్చింది. అందులో భాగంగానే ప్రస్తుతం 80 ఫీట్ రోడ్డులోని టిడిపి కార్యాలయాన్ని నిర్మించారు. ఇప్పుడే ఏమీ ఎరగనట్లు వైసిపి అక్రమంగా పార్టీ కార్యాలయాలను నిర్మించేస్తోందంటూ గగ్గోలు పెట్టడం ఆశ్చర్యంగా ఉంది.

తనకు గన్‌మెన్లు వద్దంటూ ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తిరస్కరించడం కొంత చర్చనీయాంశంగా మారింది. తన భద్రతకోసం ప్రభుత్వం కేటాయించిన అంగరక్షకులను తిరిగి పంపేశారు. తనకు శత్రువులు ఎవరూ లేరని, తాను అధికారంలో ఉన్నప్పటి కంటే ప్రతిపక్షంలోనే బలంగా పని చేశానని, ప్రజల్లో నిత్యం ఉన్నానని చెప్పుకొచ్చారు.. తనకు, ప్రజలకు మధ్య అడ్డుగోడలు ఉండరాదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కరాఖండిగా తేల్చి చెప్పారు. ఆయనకు మంత్రి పదవి రాలేదన్న ఆవేదనతోనే ఈ నిర్ణయం తీసుకున్నారంటూ మరోవైపు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం సాగుతోంది. కారణాలేవైనా తనకు ప్రజలతో కలిసి ఉండటమే ఇష్టమని, సాధారణ ఎమ్మెల్యేగానే ప్రజలకు సేవలందిస్తానంటూ గన్‌మెన్లను తిరస్కరించడం ద్వారా జిల్లాలో ఒక కొత్త సంప్రదాయానికి నాంది పలికారు. వైసిపి మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తనకు భద్రత పెంచాలని హైకోర్టులో పిటిషన్ వేసిన నేపథ్యంలో ఇలా ఉన్న గన్‌మెన్లను వెనక్కి పంపడం ద్వారా ప్రజల్లో తిరగడానికి భయమెందుకనే సంకేతాలు నిచ్చినట్లయింది. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలంతా దీనిని ఆదర్శంగా తీసుకుంటే ప్రభుత్వ ఖర్చులూ తగ్గుతాయి. అధికార దర్పంతో కొన్నిచోట్ల అధికారులు, ఉద్యోగులపై విరుకుకుపడుతున్న ఘటనలు ఇటీవల ఎచ్చెర్ల, శ్రీకాకుళంలో చోటు చేసుకుంది. ప్రజలు అధికారమిచ్చింది సేవ చేయడానికే తప్ప అధికార దర్పం ప్రదర్శించడానికి కాదన్న విషయాన్ని గుర్తెరిగి ప్రజా సమస్యల పరిష్కరిస్తే అటువంటి ప్రజాప్రతినిధులను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎచ్చెర్ల టిడిపి నాయకులు

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి- లావేరు

వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చన్నాయుడును ఎచ్చెర్ల నియోజకవర్గ టిడిపి మండల అధ్యక్షులు శనివారం నిమ్మాడలో మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వారు మంత్రికి నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి సహకారాలు అందించాలని కోరారు. వ్యవసాయశాఖ మంత్రిగా సహకారాన్ని అందిస్తాననన్నారు. మంత్రిని కలిసిన వారిలో లావేరు, జిసిగడాం, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల అధ్యక్షులు ముప్పిడి సురేష్ కుమార్, రవి, లంక శ్యామ్, బెండు మల్లేశ్వరరావు తదితరులున్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

ఈ ఖరీఫ్‌కే సాగునీరు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార కాలువ శివారు భూములకు రానున్న ఖరీఫ్ పంటకు సాగు నీరు అందిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని లింగాలపాడు 60ఆర్ కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. వంశధార కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి సకాలంలో సాగునీరు అందించాలన్నారు. గతంలో నీరు లేక పంట మధ్యలోనే ఎండిపోయిన పంట పొలాలను తాను పరిశీలించానని, అటువంటి పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాతటెక్కలి, సైనూరు, కొత్తపేట, పిరియా రమణమూర్తి, అట్టాడ రఘు, గోవింద, పాపారావు పాల్గొన్నారు.

విప్రోకు ఎస్‌విజె విద్యార్థులు

ప్రజాశక్తి- కవిటి

మనీషా

ప్రవల్లిక

కవిటి ఎస్‌విజె విద్యా సంస్థ ల్లో ఇటీవల బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ పూర్తి చేసిన మాసుపత్రి మనీషా, సనపల ప్రవల్లిక విప్రోలో కొలువు సాధించినట్టు కరెస్పాండెంట్ బెందాళం శనివారం కింగ్ తెలిపారు. వీరిని కరస్పాండెంట్ కింగ్ తో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ధర్నా చేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో జరుగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని అఖిలభారత యువజన సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద సంఘం ఆధ్వర్యాన ధర్నా చేపట్టి మానవ హారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. యువత, విద్యార్థులను మత్తు పదార్థాల బారి నుంచి రక్షించాలన్నారు. జిల్లాలో పెద్దఎత్తున సాగుతున్న గంజాయి వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు వ్యవస్థ ఏం చేస్తుందో ప్రజలకు చెప్పాలన్నారు. జిల్లాలో పాఠశాలలు, కళాశాల వద్ద తెలియని వ్యక్తులు చాక్లెట్ల రూపంలో మత్తు పదార్థాలను కలిపి విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాల రవాణాను అడ్డుకట్ట వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు సాంబ శివరాజు, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

లోక్ అదాలత్‌తో సమన్యాయం

ప్రజాశక్తి- పొందూరు

లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేసుకోవడం వలన ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి 34 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మంజుల, బ్రహ్మాజీ, అశోక్, కిరణ్, రామ్మోహన్, కృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారులకు సొసైటీ స్థలం అప్పగింత

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గత ప్రభుత్వంలో టెక్కలి స్వర్ణకారులు సొసైటీ స్థలాన్ని అన్యాక్రాంతం చేశారని, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషితో మళ్లీ స్వర్ణకారుల సొసైటీకి స్థలం బదిలీ అయ్యిందని స్వర్ణకారులు సొసైటీ నాయకులు లక్కోజి కేశవరావు తెలిపారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం విలేకరులతో మాట్లాడారు. అడంగల్ కాపీ స్వర్ణకారులు సొసైటీ పేరు వచ్చిందన్నారు. ప్రస్తుత ఉన్న ప్రభుత్వం సొసైటీ స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని స్వర్ణకారులకు అప్పగించారని అన్నారు. జగదాత్రి డిస్ట్రస్డ్ గోల్డ్ స్మిత్ అర్‌అర్సీ సన్ ఫైప్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా ఇండస్ట్రీ మంజూరు చేసి స్వర్ణకారులకి ఆదుకోవాలని ప్రభుత్వానికి కోరారు. సమావేశంలో లక్కోజి శంఖర్, వై.శ్రీను, లక్కోజి కవి, తారక, సురేష్‌కుమార్, సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు, ప్రజాసంఘాల నాయకులు బెలమర ప్రభాకరరావు, కోత ధర్మారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కేశవరావు

కొండెక్కిన కూరగాయల ధరలు

- ప్రత్యామ్నాయ మార్గం చూపని ప్రభుత్వం
- లబోదిబోమంటున్న వినియోగదారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కూరగాయలు

వేసవి నీటి కొరత కారణంగా సాగు దిగుబడి తగ్గి కూరగాయల పంట ఒక్కసారి పడిపోవడంతో మార్కెట్లో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయని కొనుగోలు దారులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల కాలంలో కిలో రూ.20కే దొరికే కూరగాయలు ఒక్కసారి కిలో రూ.60 వరకు పెరగడంతో కొనుగోలుదారులు లేక కూరగాయల మార్కెట్లు వెలవెల బోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో బెండకాయలు, దొండకాయలు, వంకాయలు, బీరకాయలు కిలో రూ.60 ధర పలుకుతుండగా బీన్స్, చిక్కుడుకాయలు రూ.80 ధర పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో టమాటో కిలో రూ.100 ధర పలుకుతుండడం, పచ్చిమిర్చి కిలో సెంచరీ దాటిందని కొనుగోలుదారులు కూరగాయలు వండకముందే ధరలు భగ్గుమంటున్నాయని పలువురు వినియోగదారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఉల్లి, బంగాళదుంపలు గతంలో కిలో రూ.20 ఉండగా నేడు రూ.40కు చేరుకున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆకుకూరలు ధరలు కొంతమేర కొనుగోలు దారులకు ఊరట కలిగిస్తున్నప్పటికీ వెల్లుల్లి, అల్లం ధరలు డబుల్ సెంచరీ దాటడంతో వినియోగదారులు ఉలిక్కి పడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో కూరగాయలు పండించే రైతులకు సాగునీటి కొరత ఏర్పడడం వలన పంట దిగుబడి ఒక్కసారిగా తగ్గిపోవడంతో పండించిన కొద్దిపాటి కూరగాయలకు కూడా సరైన మద్దతు ధర అందడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులు పెట్టుబడిని కష్టాన్ని గుర్తించి ధర కల్పించాలని మార్కెట్‌కు తీసుకువస్తే దళారులు రైతులకు నామమాత్రపు డబ్బులు ముట్టజెప్పి అనంతరం వ్యాపా రస్తులకు కూరగాయలు చేరడంతో వారు అధిక ధరలకు వినియోగదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని పలువురు రైతులు వాపోతున్నారు. దీనివలన సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కూరగాయల ధరలు అందుబాటులో లేకపోవడంతో గత 20 రోజుల నుంచి కాయగూరలు తినలేక పోతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం కూరగాయల ధరలు పెరిగినప్పుడల్లా రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించి కూరగాయలను విక్రయించేవారని నేడు ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయాలని పలువురు కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రతి రాజకీయ పార్టీ మేనిఫెస్టోలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి ధరలు పెరిగినప్పుడల్లా ప్రజలకు తక్కువ ధరలో సరుకులను అందజేస్తామని హామీ ఇవ్వడమే కాని ఎన్నికల తరువాత ఆ హామీని విస్మరిస్తున్నారని పలువురు ప్రభుత్వాల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్కువ ధరలకు వినియోగదారులకు కూరగాయలు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

టిడిపి కౌన్సిలర్‌పై ధ్వజం

టిడిపి కౌన్సిలర్‌తో వాగ్వివాదం చేస్తున్న వైస్ చైర్‌పర్సన్లు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి)

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గత మూడేళ్లుగా తన వార్డులో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించలేదని, కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో అందరం కలసిమెలసి అభివృద్ధికి కృషి చేద్దామని టిడిపి కౌన్సిలర్ గేదెల శేఖర్ సూచించారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు, వైసిపి కౌన్సిలర్లు ఆయనపై ధ్వజమెత్తారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సెల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో జీరో అవర్ సందర్భంగా వార్డులో నెలకొన్న సమస్యలను పలువురు ప్రస్తావించారు. ఇదే సమయంలో నాలుగో వార్డు టిడిపి కౌన్సిలర్ శేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలో వచ్చిందని, కౌన్సిల్‌లో అరమరికలు లేకుండా కలిసి పనిచేద్దామని అన్నారు. దీంతో వైస్ చైర్‌పర్సన్లు భారతీదివ్య, స్వర్ణభారతిలు, వైసిపి కౌన్సిలర్లు ఆయనతో వాగ్వివాదానికి దిగారు. నాటి వైసిపి ప్రభుత్వంపై ఎందుకు విమర్శిస్తావని, వార్డులో చేసిన అభివృద్ధి పనులు కనిపించలేదని ప్రశ్నించారు. ఇంతలో టిడిపి వార్డు కౌన్సిలర్లు పత్రీ తవితియ్య, ఆసి లీలారాణి, కాళ్ల దిలీప్‌కుమార్‌లు శేఖర్‌కు మద్దతు పలికి వైసిపి కౌన్సిలర్లతో మాటల యుద్ధానికి దిగారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మీ వార్డుకి ప్రత్యేక గ్రాంట్ తెచ్చుకొని చూపించాలని అన్నారు. పురుషోత్తపురంలో ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా సక్రమంగా అందడం లేదని వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. రోజువారీ నాలుగు ట్రిప్‌లు సరఫరా చేయాలని చెప్పామని, రెండు, మూడు ట్యాంకర్లు నీటి మాత్రమే సరఫరా చేస్తున్నారని అన్నారు. ట్యాంకర్ డ్రైవర్ డబ్బులు తీసుకొని నీటిని మేరేచోటకు మళ్లిస్తున్నారని టిడిపి కౌన్సిలర్ లీలారాణి ఆరోపించారు. తమ వార్డులో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చమని చెప్పానా ఇప్పటికీ మార్చలేదని వైసిపి కౌన్సిలర్ పి.మంజులత అధికారులు దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ దీపాలు కొనుగులులో ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్ బచ్చు జగన్ కోరారు. అనంతరం ఎజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ రమేష్, మేనేజర్ హరిమోహన్, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తాన్, సాలీనా ఢిల్లీ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంపై ఎమ్మెల్యే ఆరా

ప్రజాశక్తి- రణస్థలం

మండలం నారువ గ్రామ సమీపంలో ఉన్న సరాక ఫార్మా పరిశ్రమలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. తెలిసిన వెంటనే సంఘటన స్థలాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పరిశీలించారు. అగ్ని ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు పరిశ్రమ యాజమాన్యం, అగ్నిమాపక అధికారులకు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశ్రమ పరిసరాలను పరిశీలించి అగ్ని ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలను పరిశ్రమ యాజమాన్యం, అగ్నిమాపక అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగుచర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా భద్రతా చర్యలు తీసుకోవాలని పరిశ్రమ యాజమాన్యానికి సూచించారు.

ఉపాధ్యాయునికి సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలం లోలుగు కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందనున్న పైడిపెద్ది గారి వాసుదేవరావును శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వాసుదేవరావు సేవలు మరులేమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కామరాజు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, ఉపహర్ స్వచ్ఛంద సభ్యులు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

రేపు వర్సిటీ వద్ద ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి, ఎస్‌టి, మహిళ, వికలాంగుల, మైనార్టీ లా రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు చేయకుండా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో పూర్వ విసి నిమ్మ వెంకటరావు ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టారని, ఈ నియమకాలను రద్దు చేయాలని కోరుతూ జూలై 1న యూనివర్సిటీ వద్ద మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు దళిత సంఘాల జెఎసి నాయకులు తెలిపారు. నిమ్మ వెంకటరావు చేపట్టిన 34 అక్రమ నియామకాలు తక్షణమే రద్దు చేసి వాటిపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. నగరంలోని భీం భవన్ వసతి గృహం వద్ద మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంబేద్కర్ చైర్‌సాధన సమితి కన్వీనర్ టొంపల రమణ, దీర్ఘాసి గణేష్, పచ్చిపాల కిరణ్ కుమార్, బొంతు సతీష్, బడాన అనిల్ కుమార్, లైమ్మల ప్రసన్న కుమార్, సంబాన ధర్మేంద్ర, నడగాన ప్రభాస్ రాజ్, సవర విజయ కుమార్, కిల్లాడ జగదీష్, బాలకృష్ణ, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

పొలం గట్లు వెడల్పు చేసుకోవాలి

ఆమదాలవలస: మండలంలో ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో చేపేనపేటలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమక్షంలో రైతులు వరి పొలం గట్లను వెడల్పు చేయించి చదును చేయించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విభాగంలో యల్‌టు డిజిటల్‌గా పనిచేస్తున్న సురేష్ మాట్లాడుతూ డిపిఎం రేవతి ఆదేశాలు మేరకు ప్రధానంగా రైతులు ప్రస్తుతం వరి పొలం గట్లను 3 నుంచి 5 అడుగులు వెడల్పు ఉండేలా చదును చేసుకోవాలన్నారు. వాటిపై పలు రకాల కూరగాయ విత్తనాలను బెండ, చిక్కుడు, బీన్స్, టమాటా, వంగ, బీర, ఆనప నాటుకోవాలని సూచించారు. అలాగే మధ్యమధ్యలో గట్లపై ఒకవైపు ఉండేలా అరటి, కొబ్బరి, మునగ మొక్కలను కూడా వేసుకొని సాగు చేయాలన్నారు. అలాగే వరి పంటకు రక్షణ పంటగా కంది, బంతి వేసుకుంటే చీడపీడల నుంచి సంరక్షించబడుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులతో వరి పంటతో పాటుగా అదనంగా ఆదాయం వచ్చేలా గట్లుపై బహుళ పంటల సాగును ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

మజ్జిగ పంపిణీ

మజ్జిగను పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

సోంపేట: పట్టణంలోని యశోద నగర్ వాసులకు రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ దుద్ది శ్రీనివాసరావు ఆధ్వర్యాన శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. 85 రోజులుగా పాదచారులకు మజ్జిగ, తాగునీటిని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు డాక్టర్ ఇ.లక్ష్మీనారాయణ, దున్న రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

సూర్యనారాయణపై కేసులు ఎత్తివేయాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణపై పెట్టిన కేసులను ఎత్తి వేయాలని ఎపి వాణిజ్య పన్నుల సర్వీసెస్ అసోసియేషన్ విజయనగరం డివిజన్ బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరి, టి.నిరంజీన్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యనారాయణపై పెట్టిన అక్రమ కేసుల్లో ఇంతవరకు ఛార్జీషీటు దాఖలు చేయలేదని అన్నారు. వాస్తవ విరుద్ధమైన ఈ కేసుల్లో విముక్తి కల్పించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న సూర్యనారాయణను ఇబ్బందులకు గురిచేస్తూ 2023 మే నెలలో ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేశారని అన్నారు. పోలీసులు అతని కుటుంబాన్ని సైతం వేధింపులకు గురి చేశారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు తిరుపతిరావు, కిలారి నారాయణరావు, రాణాప్రతాప్, తవిటన్న, సూర్యచంద్ర, రవిప్రసాద్, జయమ్మ, శ్రీధర్, ప్రదీప్ ఉన్నారు.

ఎమ్మెల్యే సీటుపై మున్సిపాలిటీలో చర్చ

ప్రజాశక్తి- పలాస

స్టేజ్ కింద కూర్చున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే గౌతు శిరీష కుర్చీకోసం శనివారం చర్చ జరిగింది. సమావేశం ప్రారంభం కావడంతో గత ప్రభుత్వంలో మాజీ మంత్రి హయాంలో నిర్వహించిన మాదిరిగా చైర్మన్ ఎదురుగా ఎమ్మెల్యే సీటు పక్కపక్కన వైస్ చైర్మన్లు సీట్లు ఉండే విధంగా ఏర్పాటు చేశారు. సమావేశం ప్రారంభం కావడంతో ఎమ్మెల్యే శిరీష, చైర్మన్ ఎదురుగా ఏర్పాటు చేసిన సీటులో కూర్చున్నారు. దీనిపై కౌన్సిలర్లు దువ్వాడ శ్రీకాంత్, గురిటి సూర్యనారాయణలు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అప్పయ్యదొర హయాం నుంచి చైర్మన్ పక్కనే ఎమ్మెల్యే సీటు కేటాయించడం ఆనవాయితీగా నడుస్తుందన్నారు. గత ప్రభుత్వంలోనే దీనిని మార్పు చేశారని, అలా కాకుండా చైర్మన్ పక్కనే ఎమ్మెల్యే సీటు ఏర్పాటు చేయాలని ప్రతి పాదించారు. చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇదే వద్ధతి కొనసాగిందని, మెజార్టీ సభ్యులు అంగీకారం తీసుకొని వారి ప్రతిపాదన మేరకు అలా చేయడానికి ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. దీనిపై విప్ దుర్గాశంకర్ పండా మాట్లాడుతూ ఎవరిని ఎక్కువ తక్కువ చేయాలని ఉద్దేశం తమకు లేదని, నిబంధనల ఎలా ఉంటే అలా చేయాలని చెప్పారు. దీంతో చైర్మన్ ఎమ్మెల్యే సీటును వేదికపై తనపక్కన వేయాలని కమిషనరుకు ఆదేశించారు. వెంటనే ఎమ్మెల్యే సీటు వేదికపై వేశారు.

పవన్ కృషితోనే కూటమి ఏర్పాటు

మాట్లాడుతున్న శ్రీధర్

నందిగాం: రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో కూటమి ఏర్పాటుకు పవన్ కళ్యాణ్ చేసే కృషి ఎనలేనిదని జనసేన నాయకులు డాక్టర్ ధానేటి శ్రీధర్ అన్నారు. నందిగాంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో కూటమి ఆధ్వర్యాన శనివారం విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి బలంతో కేంద్ర విమాయనాశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు 3.50 లక్షలు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు 34 వేల మెజారిటీతో గెలుపొందారని అన్నారు. వీరిద్దరూ కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రులుగా ఉండడంతో జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో కూటమి ఐక్యమంగా విజయం సాధించాలని అన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అజయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పని చేసి అభివృద్ధి చేస్తామని అన్నారు. పి.చంద్రశేఖరరావు, కె.యాదవ్, ఎస్.షణ్ముఖరావు, టి.చిరంజీవి, పి.సోమేశ్వరరావు, ఎం.బాలకృష్ణ, కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

చదువే భవితకు వెలుగు

నౌపడ: బాలల చదువు భవితకు వెలుగు అని దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య అన్నారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేస్తూ గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలన్నారు. వంద శాతం నమోదు సాధించడానికి కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, తిరుపతిరావు, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీ ధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, రోజా, కృష్ణవేణి పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థికసాయం

ప్రజాశక్తి- బూర్జ

బూర్జ : ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చిన్ననాటి నుంచి కలిసి మెలిసి తిరుగుతూ చదువుకున్న మిత్రుడు అకాల మృత్యువాత పడ్డాడు. అయితే ఆ కుటుంబానికి అండగా తామున్నామంటూ బాల్య మిత్రులందరు ఒకటయ్యారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1992లో 10వ తరగతి చదువుకున్న గొర్ల కాంతారావు ఇటీవల మృతి చెందాడు. స్నేహితులు మరణం బాధాకరమైనప్పటికీ ఆ కుటుంబానికి తమ వంతుగా సహాయం అందజేయాలని స్నేహితులందరూ ఒకటయ్యారు. శనివారం మండల కేంద్రమైన బూర్జలో మిత్రుని నివాసం నందు ఆయన భార్య రమణమ్మకు రూ.29 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఎల్లప్పుడూ అండగా ఉంటామని తందాన సింహాచలంతో పాటు మిత్రులు హామీ ఇచ్చారు. వీరితో పాటు కంట భాస్కరరావు, చిన్ని సింహాచలం,యోగేశ్వరరావు, కుమారస్వామి ఉన్నారు.

పలాస: కాలేయం ఇన్ఫెక్షన్ కారణంగా తీవ్ర పచ్చకామెర్లతో బాధపడుతూ శ్రీకాకుళం ప్రభుత్వాస్పత్రిలో స్థానిక అంబేద్కర్‌నగర్‌కు చెందిన తలగాన వెంకటరమణ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న 2006లో పదో తరగతి చదివిన స్నేహితులు కష్టకాలంలో తామున్నామంటూ భరోసా ఇచ్చారు. సొంతంగా చందాలు వేస్తూ వెంకటరమణ కుటుంబ సభ్యులకు రూ. 15 వేలు ఆర్థికసాయం అందించారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాము ఉన్నామని, అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్.గిరి, తొక్క సురేష్, బొబ్బిలి శివ, జామి సంజీవ్, లక్షణ, బొబ్బిలి సంతోష్, సుధీర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బాధితులు

కుక్కల స్వైరవిహారం

టెక్కలి రూరల్ : టెక్కలిలో కుక్కలు స్వైరవిహారం చేశాయి. పట్టణంలోని పలు వీధుల్లో శుక్రవారం నుంచి కుక్కలు 11 మందిపై దాడి చేసి గాయపరిచాయి. బాధితులు టెక్కలి జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రి ఆర్‌టిసి బస్సు దిగి నడుచుకుంటూ వెళ్లి ప్రయాణికులను వెంటపడి మరీ గాయపరిచాయి.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోవిందరావు

ఐటిడిఎను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- పాతపట్నం

మెళియాపుట్టి మండలంలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. ఈ మేరకు విజయవాడలోని ఉండవల్లి నివాసంలో ఆయనను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలాని విన్నవించారు. వలసల నివారణకు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వంశధార నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లోకేష్ స్పందిస్తూ... అభివృద్ధికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఇఇ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంబంధించిన పనులు చేపట్టేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కాశీబుగ్గ పరిధిలో శ్రీనివాస నగర్, రోటరీ నగర్, నెహ్రూ నగర్, నిత్యానందనగర్, ఎంపిడిఒ కార్యాలయం, పండా క్వార్టర్స్, పండ తోట ఏరియా, రైల్వేస్టేషన్, తిలక్ నగర్, ఇండస్ట్రీ ఏరియా కిడ్నీ ఆస్పత్రి, నెమలి నారాయణ పురం, పద్మనాభపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

డివిజన్, నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటుకు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవచూపాలని పలువురు కోరుతున్నారు. గతంలో డివిజన్ పోస్టల్ కార్యాలయంలో తత్కాల్, రిజర్వేషన్ కౌంటర్ ఉండేది. కానీ, రైల్వే శాఖ తీసుకున్న నూతన నిబంధనల మేరకు కౌంటర్‌ని ఎత్తేశారు. దీంతో రైల్వే టికెట్లు అవసరమైనప్పుడు నౌపడ రైల్వే కూడలికి వెళ్లాల్సి వస్తోంది. నియోజకవర్గ పరిధిలో పలు గ్రామాలకు చెందిన వ్యాపారస్తులకు అందుబాటులో తత్కాల్ రిజర్వేషన్ కౌంటర్ అవసరమని పలుమార్లు రైల్వే శాఖ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు. టెక్కలి రైల్వే స్టేషన్‌లో రాజ్యారాణి ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేసే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డిఎస్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ పిసిసి అధ్యక్షులు, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ మృతిపై ఎపి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 2004లో ఎపి సిఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేసిన ఆయన సభ్యులందరితో ఎంతో హుందాగా వ్యవహరిస్తూ రాష్ట్రంలోని వివిధ శాసనసభ నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలపై స్పందించి సకాలంలో చర్యలు తీసుకునే గొప్ప మనస్తత్వం ఉన్న వ్యక్తి అని కొనియాడారు. ఆయన పిసిసి అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తాము కూడా పార్టీలో భాగస్వాములు కావడం స్వేచ్ఛగా పార్టీ కోసం కృషి చేయడం మరపురానిదని గుర్తు చేసుకున్నారు. అటువంటి వ్యక్తి మృతి తనను ఎంతగానో కలచి వేయడంతో పాటు రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి తీరని లోటన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీష

రాజు మృతి టిడిపికి తీరని లోటు

వజ్రపుకొత్తూరు: మాజీ ఎంపిపి, కొమరల్తాడ మాజీ సర్పంచ్ బచ్చల రాజు మృతి టిడిపికి తీరని లోటని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన రాజు కుటుంబ సభ్యులను ఆమె శనివారం అతని స్వగృహంలో కలిసి పరామర్శించారు. ముందుగా రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. మృతుని కుమారులు విజయ్ కుమార్‌వర్మ, రంజిత్ కుమార్ వర్మలను ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఆమెతో పాటు మాజీ ఎంపిపి వసంతరావు, నాయకులు గోవింద పాపారావు, దున్న షణ్ముఖరావు, కొనారి కిరణ్‌కుమార్, యోగేష్, అఖిల్ ఉన్నారు.

కిట్లు పంపిణీ

ఇచ్ఛాపురం : మున్సిపల్ పరిధిలోని పురుషోత్తపురం మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేమ్‌కుమార్, పత్రీ తవిటయ్య శనివారం పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ అనుష, రెండో వార్డు కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి పాపారావు, రమేష్, రాజు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బొడ్డపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సారా కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.